# బెజవాడ కథలు

# అగోచరుడు

"ఓం! తంత్రనాళికా! హ్రాం! శక్తి వాహికా!
క్లీం! రక్తజ్వాలా మాలికా! ఘ్రాం! కపాల మాలికా!!" అతని కంఠస్వరం పిడుగులు వర్షించినట్లుగా వినిపిస్తోంది.

ఆకాశంలో కారుమేఘాలు క్రమ్మి ఉన్నాయి. విద్యుల్లతలు ఆకాశమంతా అల్లుకుంటూ కనులు మిరుమిట్లుగొలుపుతున్నాయి.

ఇంద్రుని రథాల వలె మబ్బుతునకలు పెళ్లున ఢీకొంటున్నాయి. ఆకాశం పగిలిపోయేలా ఉరుముతోంది.

పిడుగులు కురుస్తున్నాయి.

ఇంద్రకీలాద్రి మీద దుర్గమ మెడలో హారాలు అమరుతున్నవేళ అయింది. నక్కలు ఊళలు వేస్తున్నాయి. అడవి జాగిలాలు రక్తపిపాసతో వికృతంగా విలపిస్తున్నాయి.

విశాలమయిన హోమగుండంలోంచి అగ్నికీలలు జ్వాలల నాలుకలు చాచి హవిస్సులను అర్థిస్తున్నాయి. హోమధూమం విజయవాటికనిండా పరుచుకొంటోంది.

అగోచరశాక్తేయుడు హోమాగ్ని ఎదురుగా ఒంటి కాలిమీద నిలిచి ఉన్నాడు. చేతులు పైకెత్తి శిఖ మీద ఆనించుకున్నాడు. కనులు అర్ధనిమీలితంచేసి శక్తి ఆరాధనం కొనసాగిస్తున్నాడు. దుర్గాదేవి వాహనం అయిన మృగరాజు ఆకలితో ఆవురించి జూలు విదిల్చింది.

కాశ్మీర శైవులలో ఒక శాఖ అగోచరశాక్తేయులు! అవ్యయమయిన మంత్ర, తంత్ర, క్షుద్ర విద్యావిశారదులు! శక్తి ఆరాధనంలో అతి తీవ్రవాదులు!

అంబ ఆరాధనకై, ఆమె ప్రసన్నం కావటానికై తమకున్నదంతా సమర్పించుకోగల త్యాగధనులు!

ఆహారము, నిద్ర, భయ, మైథునాలను జీవితకాలం శాశ్వతంగా పరిత్యజించిన వారు కొందరు!

ఒంటి కాలిపై స్పృహ తప్పి పడిపోయిందాకా నిలబడే వారు కొందరు! కాళ్ళను ఖండించి హోమంలో అర్పించేవారు!

చేతులు తెగటార్చి అంబకు ఆహారం చేసేవారు!

కనుగుడ్లు పెరికి అంబకు పూజాసుమాలుగా నైవేద్యం పెట్టేవారు! హోమాగ్నిలో పడేలా శిరస్సులను ఖండించి వ్రేల్చేవారు! అంతటి తీవ్రవాదులు అగోచరశాక్తేయులు!

శక్తి, శివాని, శాంకరి, శాంభవి వివిధ రూపాల్లో వీరు దుర్గారాధకులై దక్షిణాది అంతా పరుచుకుపోయారు!



వారి నియమాలు అతి నిహోరము! అతి కఠోరము!!

శక్తి ఆరాధకుడు కాని మనిషి కంటపడరు! పగటి పూట ఎక్కడా ఎవ్వరికీ కన్పించరు!

శాక్తేయ విరోధి కూటముల వారిని పట్టి వధించి అంబకు రక్తదాహం తీర్చటమే పుణ్యకార్యమని వారి విశ్వాసం!

అగోచరశాక్తేయులపట్ల జనజీవనంలో భయభ్రాంతులు వెలరేగినాయి.

దుర్గాంబ వారికి కొంగు బంగారమేనంట! కోరికలు తీర్చేనంట! 'కో' అని పిలిచిన 'ఓ' అని పలికేనంట అని చెప్పుకుంటున్నారు. "కపాల మాలా మనోహారి! ప్రసన్న!!
జ్వాలా కీలా రుణ రక్తజిహ్వే!! సుప్రసన్న!
శివాని ప్రసన్న! శాంకరీ సుప్రసన్న! శాక్తేయీ!
మహాదేవి! నాగాభరణీ! ప్రసన్న! సుప్రసన్న!!"
హోరెత్తించే వర్షపుగాలితో పిడుగులు పడుతున్న విధంగా అరిచాడు అగోచరుడు.

హోమజ్వాలలు అరుణారుణంగా కాంతి రేఖల్ని అతని

ముఖం మీద పరుస్తున్నాయి. అతని కన్నులు, రక్తకాంతుల్ని చిమ్మినాయి. ముఖం ఉద్విగ్నంగా అయిపోయింది. భక్తి తాలూకు ఆవేశం అతనిలోంచి కృష్ణా తరంగిణిలా జాలు వారుతోంది. ప్రక్కనేఉన్న ఖడ్గాన్ని వామహస్తంతో బిగించి పట్టుకున్నాడు. ఖడ్గధార హోమకాంతిలో తళుక్కున మెరిసింది.

దక్షిణ హస్తాన్ని ముందుకు చాచాడు.

"జయహో దుర్గా! రుధిరధారా ప్రియా!! ఆమిషాహార సంతుష్టా! ప్రకుర్యా! సుప్రసన్న! మహాదుర్గా సుప్రసన్న!!" అంటూ దక్షిణ హస్తాన్ని మణికట్టు దగ్గర ఖడ్గంతో చాచి కొట్టాడు. ముంజేయి తెగి హోమగుండంలో పడిపోయింది. అగ్నికీలలు అతని దక్షిణ హస్తాన్ని ఆశించినాయి. నల్లనిపొగ నరమాంసం ప్రేల్చిన కమురు వాసన ఇంద్రకీలాద్రి మీద పరుచుకుంది.

రక్తధారలు వర్షధారల్లా హోమగుండంలో కురుస్తున్నాయి.

అగోచరుడు తెలివి తప్పి అలాగే దుర్గ పాదాలపై ఒరిగిపోయాడు! నేలకు ఒరుగుతున్నప్పుడయినా అతని నోట వెంట శాక్తేయమంత్రాక్షరాలే పలుకుతున్నాయి!

పెళ్లున రెండు మబ్బుముక్కలు రాసుకున్నాయి. తెల్లవార్లూ కుంభపోతగా వర్షం కురుస్తూనే ఉంది.

ఉదయమే కారుమబ్బుల జోరు కాస్తంత శాంతించింది. ఓ అగోచరశాక్తేయుడు దుర్గాదేవి పాదాల దగ్గర పడి ఉన్నాడని నగరమంతా వార్తలు ప్రసరించినాయి.

విజయవాటిక జనవాహిని అంతా ఉవ్వెత్తు కెరటంలా కదిలి వచ్చింది. ఒక వంక తెగిన మొండిచేయి, మరోవంక కత్తిని పట్టిన చేయి. చల్లారిన హోమాగ్ని!

దుర్గపాదాలపై చిందిన రక్తముద్రలు!

జరిగిన సంగతేమిటో చాలా మందికి అర్థమయింది. అగోచరశాక్తేయునికి సర్వోపచారాలు ప్రారంభించినారు

నాగరిక ధన్వంతరులు చికిత్స ప్రారంభించినారు.

అగోచరుడు రెప్పలు అల్లార్చాడు! విస్మృతినించి రవంత కోలుకున్నాడు. చేతికి కట్టుకట్టి ఉంది.

"మూర్ఖ జనులారా! మీరంతా ఎందుకొచ్చారు?" అన్నాడు.

"ఇది దుర్గాదేవి ఆలయం నాయనా! ప్రజా వేదిక!"

"నాకు వ్రతభంగం చేశారు కదా!"

"నాయనా! నీ శరీరంలోంచి అలాగే రక్తధారలు కురిస్తే నీకు తెలివిరాదు. నీ శరీరాన్ని కాకులు పొడుస్తాయి. మాంస ఖండాలను అడవి జాగిలాలు పీక్కు తింటాయి కదా!

ఆయువు చెల్లినాక అర్చన లెక్కడ? ఆరాధన లేమి? శరీర మాద్యంఖలు ధర్మసాధనం అన్నారు కదా పెద్దలు!

మంచి చేసేందుకయినా దుష్టకార్యాచరణం కావించేందుకయినా శరీరమే ప్రాతిపదిక! అది సమస్తానికీ తూలిక!

అదిపోయాక భక్తి, ప్రపత్తి, శరణాగతి, అనన్యశరణాగతి అన్నీ అంతర్ధానమవుతాయి కదా!

ఓయీ! దీనుడా! ఎందుకిలా చేశావు?"

రెప్పలు విప్పి ఆ మాటలు వినవచ్చిన దిక్కుకు చూచాడు అగోచరుడు. ఒక బ్రాహ్మణమూర్తి! అఖండ అగ్నితేజస్వి! ఓజస్వి! వేదాలను రాసిపోసినట్లుగా ఉన్న ఉజ్జ్వల రూపస్వి కన్పించాడు. "ఎవడవు నీవు? ఏమి ఈ వెర్రివేదాంతము? ఎక్కడ నేర్చినావయ్యా ఒక్కొక్క క్షణానికి మూడువేల మూడువందల సార్లు పాత శరీరం నశించి క్రొత్త శరీరం పుడుతోందని నీకు తెలియదా!

కంజల, కపింజల, కణాద మహర్షులు చెప్పిన అణుశాస్త్రం నీకు తెలియదు కాబోలు! వెర్రివాడా? ప్రతిక్షణము మూడువేల సార్లు మరణించి మళ్ళీ బతికే ఈ తుచ్ఛ శరీరానికి మరొక చావు కూడా ఉన్నదా!

ఉన్నది ఒక్కటేరా వెర్రివాడా!

కపాల మాలా మనోహరి అయిన దుర్గాంబ! అఖండ చిరయశో విశ్రాంత అయిన శివకాంత! చావు పుట్టుకలు నీకు నీవుగా కల్పించుకున్న భ్రాంతులు! ఇది నా మతం! నా మనోగతం!!

మీరంతా నాకు వ్రతభంగం చేశారు. మిమ్మల్ని శపిస్తాను."

"ఆగాగు! శపించకు నాయనా! ప్రజలు భరించలేరు"

"అయితే తక్షణం మీరంతా ఈచోటు విడిచి వెళ్ళిపోండి"

"ఈ అంబ దుర్గాంబ మాతల్లి! మాకల్పవల్లి! మా అమ్మ! అమ్మని విడిచిపొమ్మని బిడ్డలకు చెప్తున్నావా? ఈ దుర్గాంబని విడిచి విజయ వాటికలో ప్రజలు ఒక్క క్షణమయినా నిలువలేరు" ఆ మహాతేజస్వి మాటలు విని తల్లడిల్లిపోయాడు అగోచరశాక్తేయుడు.

"మూర్ఖుడా! నాకు వ్రతభంగం అయిపోయింది. అంబకు ప్రాణాలు అర్పించలేని అనాచారులు మీరు. స్వార్థపరులు! పిరికిపందలు! శరీరం మీద తీపి! అంబ అనుగ్రహం మీద నాసి!

మీ ముఖం చూచినందుకు మీతో మాటాడినందుకు, మీరు నన్ను తాకినందుకు నాజన్మ అపవిత్రమయింది. అంబకు రక్తతర్పణం చేసుకుని నా పాపాన్ని ప్రక్షాళనం కావిస్తాను.

జయహో విజయదుర్గా!" అంటూ ప్రక్కనున్న ఖడ్గాన్ని అందుకున్నాడు అగోచరుడు.

ఆ మహనీయుడు, తేజస్వి అయిన పండితుడు, విజయవాటికలోని పురప్రజలు చూస్తూఉండగానే ఒక కాలు ఖండించుకున్నాడు.

"అమ్మా! దుర్గా! అపవిత్రమయి, వ్రతభంగమయి, శాక్తేయ శక్తిసంపన్నత తెలియని ఈ అనాచారులను చూచినందువల్ల పాపపంకిలమయింది ఈ శరీరం.

నా శరీరంలోని ఒక్కొక్క అవయవాన్ని ఖండించి నీకు నైవేద్యంగా అర్పించుకుంటాను. జై శాంకరీ!" అంటూ మళ్ళీ కత్తిని ఎత్తి పట్టాడు రెండో కాలు ఖండించేందుకు.

మహాతేజస్వి అయిన పండితుడు అతని చేయిపట్టి ఆపాడు. "ఈ ఉన్మాదిని త్రాళ్ళతో బంధించండి" అన్నాడు. ప్రజలు కృష్ణమ్మ కెరటాల్లా పొంగివచ్చారు.

అతని చేతిలోని కరవాలాన్ని లాగివేశారు. కదలకుండా పట్టుకున్నారు.

ఆ మహాతేజస్వి తెగిపోయిన కాలు పరీక్షించాడు. దానిలో ఇంకా జీవధాతువులు రక్తరహితాలుకా లేదు.

వెంటనే శస్త్రచికిత్స ప్రారంభించాడు.

మైలుతుత్తంతో సమనం చేయించాడు. మూలికలు వాసన చూపించి అపస్మారం కలిగించాడు. రసాయనాలలో సజీవంగా నిలువ వుంచిన మీర్జాల నాడీ తంతువులను తెచ్చి కుట్లువేశాడు.

కోతి ఎముకలతో తయారుచేసిన మర సీలలతో ఎముకలు రెంటిని కలిపి బంధించాడు. సాయంత్రానికి శస్త్రచికిత్స పూర్తి అయింది. ఉదయమే కళ్ళు విప్పాడు అగోచరుడు.

తాను ఖండించుకున్న కాలు తిరిగి కన్పించింది. చైతన్యవంతంగానే కన్పించింది. అది కలలా అన్పించింది.

తెగిపోయిన కాలు తిరిగి అతకటం సాధ్యమేనా! ఈ అద్భుతం ఎలా సాధించబడిందో ఎవరు చేసారో అర్థం కాలేదు.

"నాయనా! మండలం (40) దినాల్రాత్రాలు నీవు విశ్రాంతి తీసుకోవాలి! నీవు తిరిగి నడవగలుగుతావు!" చాలా ప్రశాంత గంభీరమయిన కంఠస్వరం విన్పించింది.

ఆ వంకను తిరిగి చూచాడు అగోచర శాక్తేయుడు.

అతడే! సుదీర్ఘమయిన కాయం కలిగినవాడు. అతని కన్నుల్లోంచి రవికాంతులు వర్షిస్తున్నాయి. ముఖం విజ్ఞానపు వెలుగుదారిలా ఉజ్వలంగా ప్రజ్వరిల్లుతోంది.

"అంబకు అర్పించిన కాలు తిరిగి ఎలా అతుక్కుంది?" ఎంతో సంభ్రమం నిండారిన కంఠస్వరంతో అడిగాడు.

"ఓయీ! నీవు అంబకు శరీర భాగాన్ని అర్పించావు. నేను ఆ భాగాన్ని అతికించాను. అర్పించటంలో ఉన్న తృప్తి నీది!

అతికించటంలో ఉన్న లాఘవం నాది! మంచి చెడులను నువ్వే నిర్ణయించుకో! మాధవ సేవకన్నా మానవ సేవ మహనీయమయినదని నేను నమ్ముతాను.

దుర్గాదేవి అనుగ్రహం వల్ల నా ప్రయత్నం సఫలమయింది. నిన్నొక్కమాట అడుగుతాను చెప్పు!

దుర్గాదేవి మన అందరికీ అమ్మ! ఏ తల్లి అయినా కన్నబిడ్డ కంఠాన్ని తెగ్గోసుకుంటే చూడగలదా! దయగల ఆ తల్లిని మీ సాంప్రదాయాలు కఠినాత్మురాలుగా చిత్రీకరిస్తున్నాయి.

నేను పొరపాటు మాటాడితే క్షమించు అంటూ వెళ్ళిపోయారాయన, శిష్యులు వెనుక పోతున్నారు.

"బాబూ! ఈ మహాపురుషుడు ఎవరు?" అని అడిగాడు అగోచరుడు.

"నీకు ప్రాణదానం చేసిన ఆ మహనీయుడు ఎవరో ఎరుగవా? తక్షశిల నలంద విశ్వవిద్యాలయాలలో మహామహోపాధ్యాయుడుగా దక్షిణ పాండిత్యప్రభలు ఉత్తరాదిన వెదజల్లిన మహాపురుషుడు అతడే! దక్షిణాదివారి రసవిద్యాపాటవాన్ని ఉత్తరాది విహాయస వీధుల్లో రెపరెపలాడించిన ఉజ్వల విజ్ఞాన కాంతిరేఖ!! అదుగో! అల్లదే! చూడు చూడు! అతడే ఆచార్య నాగార్జునుడు! రసవిద్యావిశారదుడు" అన్నాడు ఛాత్రుడు వెళ్ళిపోతూ!

అగోచరుని కన్నీలు కన్నీటి చెలమలయినాయి. భక్తిగా ఆవంకకు చేతులు మోకరించాడు!!

లల్లాదేవి